

విస్తరణకు కసరత్తు..!

● బెంగళూరు బ్రాండ్ పెంపే లక్ష్యం

● బెంగళూరు దక్షిణగా మారిన రామనగర ● బెంగళూరు ఉత్తరగా తుమకూరును మార్చేందుకు కసరత్తు

బెంగళూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ప్రపంచంతో పోటీ పడుతున్న బెంగళూరును మరింత విస్తరింపచేయాలనే కసరత్తు జోరందుకుంది. బ్రాండ్ బెంగళూరు ముసుగులో అనుబంధమైన జిల్లాలను విలీనం చేసేందుకు రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. రామనగర జిల్లాను బెంగళూరు దక్షిణగా ఇటీవలే మంత్రివర్గం తీర్మానించింది. అదే కోణంలోనే తుమకూరు జిల్లాను బెంగళూరు ఉత్తరగా మార్చాలనే అంశం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో సాగుతున్న ఈ ప్రక్రియకు సొంత పార్టీకి చెందినవారు బహిరంగంగా చెప్పుకోలేకుండా వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వ నిర్ణయాలపై న్యాయపోరాటం ద్వారా అడ్డుతగలాలనే భావిస్తున్నాయి. బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) విస్తీర్ణం పెరిగిందని ఇటీవలే గ్రేటర్ బెంగళూరు అథారిటీగా మార్చారు. అథారిటీ ముసుగులో బెంగుళూరును 3నుంచి 5 పాలికెలుగా విభజించాలని భావిస్తున్నారు. బెంగళూరు నగరం అభివృద్ధితోపాటు విస్తీర్ణం పెంచేందుకు నగరంలో వందలకొలదీ ఐటీ కంపెనీలు, బయోటెక్నాలజీతోపాటు ఎంఎన్‌సీ కంపెనీలు ఉండడమే కారణంగా ఉంది. ఇలా ప్రముఖ కంపెనీలలో పనిచేసేవారు ఏటా పెరుగుతున్నారు. దీంతో వలసలు పెరిగాయి. ఇప్పటికే బెంగళూరులో కన్నడిగుల సంఖ్య తగ్గిందని ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందినవారు పెరిగారని కన్నడసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. పాలికెను విభజిస్తే కన్నడిగులకు రాజకీయ పదవులు దూరమవుతాయని, అటువంటి పరిస్థితి తీసుకురారాదని కన్నడ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రామనగర జిల్లా పరిధిలో చన్నపట్టణ, కనకపుర ప్రాంతాలు ఉన్నాయి. ఒకప్పుడు జేడీఎస్‌కు రామనగర జిల్లా కంచుకోటగా ఉండేది. మారిన రాజకీయ సమీకరణలతో కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంది. జేడీఎస్ నేత కుమారస్వామి ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రి కావడంతో ఆయన ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సీటు కాంగ్రెస్ పరమైంది. అంతకుముందు ఎన్నికల్లో రామనగర ఎమ్మెల్యేగా అనితా కుమారస్వామి ప్రాతినిధ్యం వహించగా ప్రస్తుతం కాంగ్రెస్ పరమైంది. కనకపుర దశాబ్దాలకాలంగా డీకే శివకుమార్‌కు కంచుకోటగా ఉంది. ఇలా కాంగ్రెస్ బలం పెరగడంతో కనకపురను బెంగళూరు దక్షిణగా మారుస్తానని డీకే శివకుమార్ ప్రకటించారు. పలు అభ్యంతరాలు వచ్చినా మంత్రివర్గంలో నిర్ణయం తీసుకున్నారు. ఇదే విధానాన్ని హోం మంత్రి పరమేశ్వర్ ప్రయోగించేందుకు సిద్ధమయ్యారు. తుమకూరును బెంగళూరు ఉత్తర జిల్లాగా మార్చేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని ఇటీవలే ప్రకటించారు. కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారని వెల్లడించారు.

● ప్రాచీనకాలం నుంచి తుమకూరు జిల్లాకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ప్రాచీన చరిత్ర ఉన్న తుమకూరు జిల్లాను బెంగళూరులో విలీనంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. 1862లోనే తుమకూరు పేరు వచ్చింది. తుమకూరు పేరును మార్చాలనే ప్రయత్నాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఇప్పటికే బెంగళూరును బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ జిల్లాలుగా ఉన్నాయి. ఇటీవల రామనగరను బెంగళూరు దక్షిణగా మార్చారు. తుమకూరు జిల్లాను విలీనం చేయడం ద్వారా వచ్చే లాభం ఏమిటో ఎవరికీ అర్థం కాని విధంగా ఉందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● బ్రాండ్ బెంగళూరుతోపాటు తుమకూరు జిల్లాను అభివృద్ధి చేయాల్సిన అవసరం లేదని, అవసరం అనుకుంటే తుమకూరు పేరుతోనే పరిశ్రమలు, ఇతరత్రా సంస్థలు ఏర్పాటు చేయవచ్చుననే అభిప్రాయాలు ఉన్నాయి. బెంగళూరు ఒత్తిడి తగ్గించేందుకు తుమకూరు ప్రాంతం ప్రత్యామ్నాయమని భావిస్తే బ్రాండ్ తుమకూరుతోనే అభివృద్ధి చేయవచ్చుననే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రాష్ట్రంలోనే రెండో పెద్ద జిల్లా..

రాష్ట్రంలో అతిపెద్ద జిల్లాగా పేరొందిన బెళగావి తర్వాత తుమకూరు ఉంది. తుమకూరును 2-3 జిల్లాలుగా విభజించాలనే డిమాండ్ ఉంది. తుమకూరు జిల్లా కుణిగల్‌నుంచి ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వైఎన్ హొసకోటె తాలూకా ముగింపు దాకా ఉంది. జిల్లా కేంద్రం నుంచి వైఎన్ హొసకోటె చివరకు చేరేసరికి 130 కుపైగా కిలోమీటర్ల దూరం ఉంది. బహుశా అతి సుదూరమైన జిల్లాగా కూడా పేరుంది. బెంగళూరు ఉత్తరగా తుమకూరు జిల్లాను చేస్తే బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధిలో ఉండే నెలమంగల, డాబస్‌పేట ప్రాంతాలను ఏ జిల్లాలోకి మారుస్తారనేది స్పష్టత లేదు. బెంగళూరు గ్రామీణ జిల్లా సరిహద్దులు మారిపోనున్నాయి. గ్రామీణ జిల్లాలను దాట ఉత్తర జిల్లాల్లోకి ప్రవేశించాల్సి ఉంటుంది. గత కొన్నేళ్లుగా తిపటూరు, మధుగిరి ప్రాంతాలను జిల్లాగా విభజించాలనే డిమాండ్ ఉంది. ఇప్పటికే ఈ జిల్లా పెద్దదని, విద్యా విభాగం పర్యవేక్షణకు మధుగిరిని విద్యాశాఖ ప్రత్యేకజిల్లాగా పరిగణిస్తోంది. తుమకూరుకు ఓ ప్రత్యేక బ్రాండ్ ఉంది. వసంత నరసాపుర పారిశ్రామిక ప్రదేశం గుబ్బిలో హెచ్ఏఎల్ విభాగం, పావగడలో సోలార్ పార్క్‌తోపాటు అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంకు ఇటీవలే భూమిపూజ చేశారు. తుమకూరు పరిధికి అంతర్జాతీయ విమానాశ్రయం తేవాలని, మెట్రో సేవలు విస్తరింపచేయాలనే ఆలోచన ఉంది. వీటిని అభివృద్ధి చేస్తే జిల్లా రూపురేఖలు మారుతాయిగానీ బెంగళూరు ఉత్తరగా మారిస్తే సాధ్యమయ్యేది ఉండదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



కల్యాణ కర్ణాటక అభివృద్ధికి

కట్టుబడి ఉన్నాం

● సీఎం సిద్దరామయ్య
● రూ.440 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం





కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బళ్లారి/రాయచూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కల్యాణ కర్ణాటక జిల్లాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రిసిద్దరామయ్య అన్నారు. శనివారం యాదగిరిలో సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జుఖర్గే ఇతర కాంగ్రెస్ ప్రముఖులు యాదగిరిలో రూ.440, 68కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ కర్ణాటక యాదగిరి, బీదర్, కలబుర్గి బళ్లారి,రాయచూరు, కొప్పళ, ఈ ఏడు జిల్లాల కల్యాణ కర్ణాటక అభివృద్ధి బోర్డు, ఆరోగ్య అవిచార్ పథకం కింద ప్రారంభిస్తున్నట్లు సీఎం చెప్పారు. ఏటా కేకేఆర్‌డీబీకి ఏటా రూ.5కోట్ల ఇస్తామని హామీ ఇచ్చామని దాని ప్రకారం ఇప్పటి రూ.5300కోట్లు పనులు పూర్తి అయ్యాయన్నారు. నంజుండప్ప నివేదికను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. కల్యాణ కర్ణాటకలో ఆరోగ్యం, విద్య, ఉపాధి, పురోగతిసాధించడంతో పాటు ప్రాథమిక సౌకర్యాల ఏర్పాటుకు నిదులు కేటాయించామన్నారు. ప్రత్యేకంగా ఆరోగ్య అభివృద్ధి కోసం పెద్దపీట వేశామన్నారు. 42ఆసుత్రులను అప్‌గ్రేడ్ చేశామన్నారు. కొత్తగా ఆసుత్రుల నిర్మాణం జరుగుతుందన్నారు. ఈ ఏడు జిల్లాలో ఆరోగ్య సౌకర్యాల విస్తరణకు రూ.840కోట్లు ప్రణాళిక చేపట్టామన్నారు. ప్రభుత్వం అనేక అభివృద్ధిచేస్తుంటే బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి నిదులు లేవని బీజేపీ అసత్య ప్రచారం చేస్తోందన్నారు. మోదీ ప్రధాని అయ్యాక నిత్యాసవర వస్తువుల ధరలు పెరిగాయన్నారు. కల్యాణ కర్ణాటకకు 371జే ఇవ్వడానికి బీజేపీ అప్పుడు వ్యతిరేకించిందని, ప్రధాని మంత్రి మన్‌మోహన్‌సింగ్, మల్లికార్జున ఖర్గే కృషిచేశారన్నారు. ఈసందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డీసీఎం



నవంబరులో ముఖ్యమంత్రి మార్పు?


● అధిష్టానానికి భయపడే మరోసారి కులగణన ● రూ.170 కోట్ల ప్రజాధనం వృథా ● ఎమ్మెల్సీ విశ్వనాథ్

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రి మార్పు అనివార్యమని, మల్లికార్జున ఖర్గే కానీ డీకే శివకుమార్‌లలో ఒకరు సీఎం అవుతారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ జోస్యం చెప్పారు. మైసూరులో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రానున్న నవంబరు రాష్ట్రంలో భారీ మార్పు జరగనుందన్నారు. గత కొంతకాలంగా బహిరంగ రహస్యం అనేలా సాగుతున్న నాయకత్వ మార్పు జరుగుతుందని స్పష్టం చేశారు. పదేళ్లక్రిందట సీఎం సిద్దరామయ్య కులగణన సర్వే చేయించారని వాటిని స్వీకరించకుండా వాయిదాలు వేసి రూ.170 కోట్ల ప్రజాధనం వృథా చేశారన్నారు. అధిష్టానం పెద్దలు రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు భయపడి మరోసారి కులగణనకు సిద్ధమయ్యారన్నారు. 90రోజుల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారని అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైందని, ఉపాధ్యాయులు ఎవరూ కులగణనలో పాల్గొనలేరన్నారు. ఇతరశాఖల ఉద్యోగులతో ఎటువంటి సర్వేను చేపట్టడం అంత సులువు కాదన్నారు. మరోసారి కులగణన చేయిస్తాననడం హిందువులకు అన్యాయం చేసినట్లేనన్నారు. మూడు నెలల్లో సర్వే అసాధ్యమని స్పష్టం చేశారు. నైతికత, ప్రామాణికత లేని సిద్దరామయ్యను గతంలో ఆదర్శమైన పాలనకు కారకులైన దేవరాజ్‌అరసుతో పోల్చరాదన్నారు. కాగా ఆర్సీబీ విజయోత్సవాల్లో ఆత్రుత తప్ప ఆచరణ లేదన్నారు. ఆర్సీబీలో కర్ణాటక క్రికెటర్లు లేరని, ఓనర్ కర్ణాటక వారు కాదని, ఆర్సీబీకి కర్ణాటకకు ఎటువంటి సంబంధం లేదన్నారు.

కావేరి హారతిపై నిరసనలు

● రూ.92కోట్లు కేటాయింపుపై అభ్యంతరం

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కావేరి నదికి అనుబంధమైన కృష్ణరాజసాగర్ జలాశయం వద్ద కావేరి హారతి నిర్వహించాలనే ప్రభుత్వ చర్యపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. మండ్య జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతోపాటు స్థానిక ప్రజాసంఘాలు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. కేఆర్ఎస్‌లో అమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటు, కావేరి హారతిని రైతులు వ్యతిరేకిస్తున్నారని మైసూరు ఎంపీ యదువీర్ తెలిపారు. శనివారం మండ్యలో మీడియాతో మాట్లాడుతూ కేఆర్ఎస్ ప్రాజెక్టు నిర్మించి వందేళ్లు కావస్తోందని, డ్యామ్ భద్రత దృష్ట్యా అమ్యూజ్‌మెంట్ పార్క్ సరికాదన్నారు. తద్వారా కేఆర్ఎస్ పరిసరాలకు, పర్యావరణానికి భంగం కలగనుందన్నారు. కేఆర్ఎస్ ఇప్పటికే ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందిన ప్రాజెక్టు అని రోజూ వేలాదిమంది సందర్శిస్తారన్నారు. మలవళ్లి తాలూకా శింషాబ్లఫ్‌తోపాటు మరెక్కడైనా నిర్మించవచ్చన్నారు. కావేరి హారతి మనమే చేస్తామని, కానీ రూ.92 కోట్ల రూపాయలతో కార్యక్రమం ఏర్పాటు చేయాలనుకోవడం సరికాదన్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే శ్రీవత్స మైసూరులో మాట్లాడుతూ రూ.92 కోట్లు ఖర్చు చేసి కావేరి హారతి ఇస్తారా..? అంటూ ప్రశ్నించారు. నియోజకవర్గాల్లో అభివృద్ధికి ఒక్కో ఎమ్మెల్యేకు కోటి రూపాయల కోసం పడిగాపులు పడుతున్నామన్నారు. కానీ హారతి పేరిట కోట్లాదిరూపాయల ఖర్చు సరికాదన్నారు.



కేఆర్ఎస్ డ్యామ్

నవజాత శిశువు అపహరణకు యత్నం

● గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది ● బాగల్కోటె జిల్లా ఆసుపత్రిలో కలకలం ● నిందితురాలు సహా మరొకరి అరెస్ట్



బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బాగల్కోటె జిల్లా ఆసుపత్రిలో నవజాత శిశువును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన సంఘటన చోటు చేసుకుంది. నిందితురాలు ఇదే జిల్లా రామదుర్గ తాలూకా ఖానాపేట నివాసి సాక్షి యాదవాడ. ఆమెకు సోదరితోపాటు మరొకరు సహకరించినట్లు గుర్తించిన బాగల్కోటె నవనగర పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం సాయంత్రం జిల్లా ఆసుపత్రికి వచ్చి అనుమతి లేకుండానే కాన్పుల వార్డుకు వెళ్లారు. బిడ్డ పుట్టిందని పలువురికి చెప్పుకొన్నారు. శనివారం తెల్లవారుజామున 4.30 గంటలకు నర్సుగా చెప్పుకొంటూ వార్డులోకి వచ్చి శుక్రవారం పుట్టిన బిడ్డకు కఫ తీయాలని ఓ చిన్నారిని తీసుకెళ్లి మరో బెడ్‌పై పడుకున్నారు. ఎంతసేపటికీ నర్సు బిడ్డను తీసుకురాకపోవడంతో తల్లి ఆందోళన చెందారు. సాక్షియాదవాడ పక్కన చిన్నారి ఉంది. అయితే తన బిడ్డగా ఆమె చెప్పుకొన్నారు. బిడ్డ కోల్పోయిన తల్లితోపాటు బంధువులు డాక్టర్లకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ మహంతేశ్ అధికారులతోపాటు వార్డులనుంచి ఎవరూ బయటకి పోకుండా కట్టడి చేసి నవజాత శిశువులను పరిశీలించారు. సాక్షి యాదవాడ తన బిడ్డగా వాదించారు. అయితే ఆమెకు ఆసుపత్రిలో కాన్పు చేసినట్లు రికార్డులు లేవని డాక్టరుతోపాటు సిబ్బంది తెలిపారు. దీంతో సాక్షియాదవాడతోపాటు ఆమెకు సహకరించిన ఇద్దరిని అరెస్టు చేశారు. బాగల్కోటె ఎస్పీ అమరనాథరెడ్డి మాట్లాడుతూ శిశువును చోరీ చేసిన విషయమై భిన్నకోణాలలో పరిశీలించి ఎవరి నిర్లక్ష్యమని ఆరా తీస్తున్నామన్నారు.

బస్సు ప్రమాదంలో డ్రైవర్ మృతి

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హొస్కోటె వద్ద ప్రమాదఘటనలో తీవ్ర గాయాలకు గురైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ వీఎల్‌కే కుమార్ (50) చికిత్సలు ఫలించక శనివారం మృతి చెందాడు. బెంగళూరు ఏపీఎస్ ఆర్టీసీ ఏటీఎం రవీంద్రరెడ్డి శనివారం మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక సిలికాన్‌సిటీ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్సలు అందించారన్నారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం బన్నేరుఘట్టరోడ్డులోని మరో ఆసుపత్రికి మార్పు చేసినా చికిత్సలు ఫలించక మృతి చెందారని విచారం వ్యక్తం చేశారు. చిత్తూరు పట్టణానికి చెందిన కుమార్‌కు భార్య, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని వారి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. దీంతో బస్సు ప్రమాదంలో ప్రమాద మృతుల సంఖ్య ఆరుకు చేరిందన్నారు.

విజయపుర వైద్యుల కుమారుడికి

నీట్‌లో టాప్ ర్యాంకు

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విజయపుర నగరం సంజీవిని సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు సిద్దప్ప సన్నద్, మీనాక్ష సన్నద్ కుమారుడు నిఖిల్ సన్నద్ శనివారం విడుదలైన నీట్‌లో 17వ ర్యాంకు సాధించారు. రాష్ట్రానికి టాప్ ర్యాంకర్‌గా నిలిచారు. పీయూలో 720 మార్కులకుగాను 670 మార్కులతో ఉత్తీర్ణుడయ్యారు. నిఖిల్ మాట్లాడుతూ.. ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేయాలన్నదే లక్ష్యమన్నారు.



నిఖిల్ సన్నద్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

శివోహం ఆలయంలో నటి కంగనా రనౌత్




ఆలయంలో నటి కంగనా రనౌత్

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మురుగేశ్‌పాళ్య శివోహం, మాతా వైష్ణో దేవి ఆలయాలను ప్రముఖ నటి, లోక్‌సభ సభ్యురాలు కంగనా రనౌత్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కంగనా మాట్లాడుతూ 65 అడుగుల శివుడి విగ్రహం శాంత, ధ్యానమందిరాలకు అనుబంధంగా అద్భుతంగా తీర్చారన్నారు. తీర్థయాత్రలు చేస్తున్నానని అందులో భాగంగా బెంగళూరులో శివోహం ఆలయాన్ని సందర్శించడం సంతోషంగా ఉందన్నారు. ఇది కేవలం పూజాస్థలం కాదని, ఆధ్యాత్మికశక్తి కేంద్రమని కొనియాడారు. ఆలయ వ్యవస్థాపకులు రవితోపాటు పలువురు పాల్గొన్నారు.

గణనాథుడికి మామిడిపండ్లతో అలంకరణ..



సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని వెయ్యి మామిడికాయలతో బసవనగుడి ఎన్ఆర్ కాలనీలో వినాయకుడికి శనివారం ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. సాయంత్రం విశేషపూజల అనంతరం భక్తులకు మామిడి పండ్లను ప్రసాదంగా పంపిణీ చేశారు. (ఆంధ్రజ్యోతి, బెంగళూరు)



తుంగభద్ర నీటి మట్టం :1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1603.33	1,582.69
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	6,618	3,737
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	128	10
నీటి నిల్వ (టీఎంసీలు)	26.14	5.91

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● డ్రైవర్ దుర్మరణం



దెబ్బతిన్న మినీ వ్యాన్

బళ్లారిరూరల్, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): బళ్లారి నగర శివారులో ఆటోను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. శనివారం హగరి వైపు మీదుగా చింతకుంట వెళుతున్న ఆటోను గుంతకల్లు నుంచి బళ్లారి వైపు వస్తున్న బస్సు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ హనుమేష్ (35) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో మరో వ్యక్తికి స్వల్ప గాయాలు అయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. హనుమేష్ మృతదేహాన్ని బళ్లారి విమ్స్ ఆస్పత్రికు తరలించి పోస్టుమార్టమ్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. సంబంధిత ఆర్టీసీ డ్రైవర్ పరారీలో ఉన్నారు.

విద్యార్థులకు సాంకేతిక

నైపుణ్యం తప్పనిసరి

● వీఎస్కేయూ వీసీ మునిరాజు

బళ్లారి సిటీ,జూన్ 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతికతను సద్వినియోగం చేసుకుని తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలని విజయనగరంలోని శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మునిరాజు అన్నారు. హొసపేట నగరంలోని శంకర్ ఆనంద్ సింగ్ ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాలలో శనివారం కమిటీల ముగింపు వేడుకల ప్రారంభోత్సవంలో జర్నలిజం విద్యార్థుల కోసం ప్రయోగాత్మక వార్తాపత్రిక విద్యార్థి పత్రిక విడుదల చేసి మాట్లాడారు. విద్యార్థులు ఒకే కోర్సులో ఉండడమే కాక సాంకేతిక ఉన్న కోర్సుఎంపిక చేసుకోవాలన్నారు. అన్ని రంగాలలో తగినంత ఉద్యోగ అవకాశాలను ఉపయోగించుకోవాలన్నారు. మన విశ్వ విద్యాలయంలో అనేక కోర్సులు ప్రారంభమైయ్యాయి. అదనంగా కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. ఐఏఎస్, ఐపీఎస్,బ్యాంకింగ్, పోలీస్ పోటీ పరీక్షలకు తయారు కావాలన్నారు. హంపి కన్నడ విశ్వవిద్యాలయం విశ్రాంత ప్రొపెసర్ చెలువరాజు మాట్లాడుతూ పేద పిల్లలక ఈ కళాశాల అత్యంత పెద్ద వేదిక ప్రతి విద్యార్థులు మంచి అబ్యాసం చేయాలన్నారు. కళాశాల విద్యాశాఖలో ముఖ్యమైన పథకాలను ప్రభుత్వం అందించడంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా కన్నడ విభాదిపతి దేవన్న, వీరభద్రప్ప, వీరేంద్ర పాటి, కనకట్టిజయన్న, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కలుషిత నీటితో 27 మందికి అస్వస్థత



గ్రామంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

రాయచూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సింధనూరు తాలూకా భూతలదిన్ని గ్రామంలో కలుషిత నీరు తాగడం వల్ల 27 మంది అస్వస్థులైయ్యారు. వీరిలో 8 మందికి చికిత్స అనంతరం నయం కాగా మరికొంత మంది ఇప్పటికే చికిత్స పొందుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం గ్రామాన్ని పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారుల బృందం పరిశీలించింది. గ్రామ సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇప్పటికే నాల్గు బెడ్‌లను సిద్ధం చేసిన ఉంచిన వైద్య శాఖ అధికారులు ఒక అంబులెన్స్‌ను సహితం అందుబాటులో ఉంచి అత్యవసర పరిస్థితిలో వినియోగించేందుకు నిర్ణయించారు. ఈ క్రమంలో అధికారులు గ్రామంలోని ఆర్‌ఓ ప్లాంట్‌ను పరిశీలించి తాగునీటిని సహితం శ్యాంపల్ సేకరించి పరీక్షకు పంపారు. రెండు రోజుల క్రితం కొద్ది మందికి కడుపునొప్పి రాగా అనంతరం వాంతులు, బేదులు రావడంతో ప్రజలు ఆందోళనకు గురైయ్యారు. కాగా తాగునీటి శ్యాంపల్ సేకరించామని పరీక్షల అనంతరం అసలు కారణం తెలుస్తుందంటు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు భరోసా ఇచ్చారు. ఎవ్వరికి ఎలాంటి ప్రమాదం లేదని ఇప్పటికే వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచామని ఎవ్వరు ఆందోళన చెందాల్సిన పని లేదని అధికారులు తెలిపారు. కాగా ఈ విషయంలో స్పందించిన డీహెచ్‌ఓ డా.సురేంద్ర బాబు, ఇప్పటికే తాగునీటి శ్యాంపల్ సేకరించామని ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ఎప్పటికప్పుడు వైద్య ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచామని ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించారు. కాగా గ్రామాన్ని సందర్శించిన అధికారులతతో గ్రామస్థులు కొంత వాగ్వాదానికి దిగారు. ఆర్‌ఓ ప్లాంట్‌ను శుద్దీకరించాలని, తాగునీటి సరఫరాను మెరుగు పరచాలని పలు సార్లు పిర్యాదు చేసినా పట్టించుకోలేదంటు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆస్తులు, రికార్డులు స్వాధీనం చేసుకోలేదు

● అన్ని ప్రశ్నలకూ సమాధానం ఇచ్చా : ఈడీ దాడులపై ఎమ్మెల్యే గణేష్



బళ్లారి. జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న ఎన్‌ఫోర్స్‌మెండ్ డైరెక్టరేట్(ఈడీ) జరిపిన దాడుల్లో ఎటువంటి ఆస్తులు, రికార్డులు స్వాధీనం చేసుకోలేదని కంప్లి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 12న ఈడీ అధికారులు బళ్లారి జిల్లాలోని బళ్లారి సిటీ, బళ్లారి రూరల్, సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, కూడ్లిగి ఎమ్మెల్యే ఎన్.టీ శ్రీనివాసులు, ఎంపీ తుకారాం ఇళ్లలో సోదాలు చేసిన విషయం తెలిసింది. తన ఇంట్లో ఈడీ బృందం ఉదయం నుంచి రాత్రి వరకూ సోదాలు చేసిందని, కానీ ఏ ఒక్క చిన్న అవినీతి రికార్డు ఈడీ సోదాల్లో బయట పడలేదన్నారు. చివరకు ఈడీ అధికారులు తనికీల్లో ఏమీ దొరకలేదని సంతకాలు కూడా చేయించుకున్నారన్నారు. కొన్ని పత్రికల్లో ఊహాజనితంగా వార్తలు రావడం బాధాకరమన్నారు. ఈడీ అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకూ స్పష్టమైన సమాదానం ఇచ్చానన్నారు.

ఎమ్మెల్యే.. ప్రజల మనిషి

చానల్ చన్నబసవరాజ, కొళ్లూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



కంప్లి ఎమ్మెల్యే ప్రజానాయకుడు, ఆయన ఎటువంటి అక్రమాలకు పాల్పడరు. అఖండ బళ్లారి జిలాల్లో ఉండే నియోజక వర్గాల అభివృద్ధికి ఆయన పని చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తోంది, వారి దాడులను కంప్లి ఎమ్మెల్యే ధైర్యంగా ఎదుర్కొని సమాధానం ఇచ్చారు. ఎమ్మెల్యే ఇంట్లో ఎటువంటి అక్రమ ఆస్తుల పత్రాలు, రికార్డులు లభించలేదు.

రాజకీయ దురుద్దేశంతోనే దాడులు

శ్రీనివాస్‌రావు, కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



ఎమ్మెల్యే గణేష్ ఇంటిపై దాడులు కేవలం రాజకీయ దురుద్దేశంతోనే జరిగాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ సంస్థలతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై దాడులు చేయిస్తోంది. ఎమ్మెల్యే ఇంట్లో ఎటువంటి అక్రమ ఆస్తులు స్వాధీనం చేసుకోలేదు. అన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

కేంద్ర పథకాలు పేదలకు వరం: ఎమ్మెల్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వైఎం సతీష్

కంప్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు వరాలు అని ఎమ్మెల్సీ వైఎం సతీష్ అన్నారు. శనివారం కంప్లి పట్టణ బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వికసిత్ భారత్ సంకల్ప సమావేశం జరుపుకుంటున్న కేంద్ర ప్రభుత్వం జీవితానికి అమృతం, సుపరిపాలన పేదల సంక్షేమం ఇచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వ అనేక పథకాలు ప్రతి ఇంటికీ చేరవేయడమే వికసిత భారత్ సంకల్ప్ ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను పేదల ఇంటింటికీ చేరవేసే కార్యక్రమమని తెలిపారు. ఈ దేశంలోని పేదల దుస్థితిని ఈ దేశంలోని రైతుల సమస్యలను అర్థం చేసుకుని ప్రధాన మంత్రి కృషి పంటల భీమా, ఎరువుల సబ్సిడీ ఈ దేశంలోని ప్రతి ఇంటికి మరుగుదొడ్లు, ప్రధానమంత్రి ఆవాజ్ యోజన, ఉజ్వల యోజన కింద ఉచిత గ్యాస్ కనెక్షన్ అందించిన ఘనత కేంద్రప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్రంగళి తిమ్మారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సుగుణ, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు రామాంజినేయులు, టీవీ సుదర్శన్‌రెడ్డి, ఆర్ ఆంజనేయ, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



సిరుగుప్ప, జూన్ 14 (ఆంధ్రజ్యోతి) : పేటే ఆంజనేయస్వామికి పుష్పాలంకార సేవలు శనివారం ఘనంగా జరిగాయి. సిరుగుప్ప పట్టణం దేశనూరు రోడ్డు మార్గంలో వెలసిన ప్రసిద్ధి చెందిన పేటే ఆంజనేయస్వామికి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ప్రధాన అర్చకులు శ్యామాచార్య స్వామివారికి పుష్పాలంకార సేవ లు, కుంకుమార్చన, మహామంగళహారతి చేపట్టారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

సిరుగుప్ప, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కోర్టులో దోషులుగా దాఖలైన వారికి పరిష్కారం కోసం లోక్‌అదాలత్‌ను ఉపయోగించుకోవాలని సిరుగుప్ప తాలుకా సివిల్ న్యాయాధికారి అశోక్ తెలిపారు. సిరుగుప్ప పట్టణం కోర్టు ఆవరణంలో జూలై 12వ తేదీన జరుగనున్న లోక్ అదాలత్ కార్యక్రమం కారణంగా ఆధ్వర్యంలో పూర్వాపరాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహసీల్దార్ నరసప్ప, వివిధ ప్రభుత్వా శాఖాధికారులు పాల్గొని చర్చించారు. ఉద్యోగుల నుంచి ప్రజల వరకు కోర్టులో కేసులు దాఖలైన వారందరు ఈ కార్యక్రమంలో పాల్గొని సమస్యలను రాజీ చేయడం ద్వారా పరిష్కరించవచ్చునని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తాలుకా పంచాయతీ ఈవో పవన్‌కుమార్, ఎస్ఐ పరశురామ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వెంకోబ, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అంధుల రాష్ట్రస్థాయి చెస్ పోటీలు



చెస్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు

బళ్లారి సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సేవియర్ డిసేబుల్డ్ సర్వీస్ కమిటీ ,రోటరీ క్లబ్ సహకారంతో హొసపేటలో నిర్వహిస్తున్న నాల్గవ రాష్ట్రస్థాయి విజయనగర్ కప్ బ్లైండ్ ఎపెన్ చెస్ టోర్నమెంట్ రెండవ రోజు విజయవంతంగా సాగింది. 16మంది పురుషులు, ఐదుగురు మహిళా క్రీడాకారులు మూడవ రౌండ్‌లోకి ప్రవేశించారు. వీరిలో 10 మంది అంతర్జాతీయ ర్యాంక్ పొందినవారు. వివిధ జిల్లాల నుంచి మొత్తం 120మంది పోటీలో పాల్గొన్నారు. వీరిలో కృష్ణఉడుప, శివమొగ్గ, దొడ్డి శ్రావిక శారదదేవి ఇన్‌స్టిట్యూట్ శివమొగ్గ, శివన్‌గౌడ ధార్వాడ్, జ్యోతి బెంగళూరు, రమేశ్ బెంగళూరు, కార్తీక్ బెంగళూరు, లింగరాజు మైసూరు, లక్ష్మీకాంత కలబుర్గి, రవికిరణ్ బెంగళూరు, గంగప్ప సనాతన ట్రస్ట్ దార్వాడ్, శశిధర మైసూర్, కెంచప్ప సనాతన ట్రస్ట్ ధార్వాడ్, కిరణ్‌కుమార్ కలబుర్గి, రవీశ్ కోలార్, వృతి జైన్ శివమొగ్గ, ధర్మరాజు తుమకూరు, సచిన్ జాదవ్ హుబ్బళ్ళి, నవీన్ మేవార్డ్ గదగ, సంగమేశ్ శరదదేవి ట్రస్ట్ శివమొగ్గ వీరందరూ మూడవ రౌండ్‌కు చేరుకున్నారు.

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

బళ్లారి సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సండూర్ పట్టణం సహా తాలూకాలోని వివిధ గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా ధర్మపూర్ గ్రామం సమీపంలోని నారిహళ్ళ పొంగి పోర్లుతోంది. బొమ్మఘట్ట సరస్సు ఉధృతంగా పారుతోంది. పొలాల్లో నీరు పేరుకుపోయి పంటలు పాడవుతున్నాయి. సండూరు, తోరణగల్లు, చోరనూర్ ప్రాంతాల్లో దాదాపు అన్ని గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కొన్నిగ్రామాలు వర్షపు నీటితో నిండిపోయాయి, నిరంతరం వర్షాల ఫలితంగా, బొమ్మఘట్ట గ్రామంలోని హిరేకెరె, హలికుంటే గ్రామాలు జలమయమయ్యాయి. వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సండూరు తాలూకాలో 4రెయిన్ గేజ్ స్టేషన్లు ఉన్నాయి. రెయిన్ గేజ్ స్టేషన్లు సండూరు పరిధిలో 34.2 చోరనూర్‌లో 21.2, కురేకుప్పలో 2.0, వితలాపూర్‌లో 1.2 వర్షపాతం నమోదయినట్లు అధికారులు తెలిపారు. రైతుల భూముల్లో పెద్ద మొత్తంలో వర్షపు నీరు పేరుకుపోవడంతో నాట్లు వేసే పనిలో కొంత ఆటంకం ఏర్పడింది, బొమ్మఘట్ట గ్రామంలో నిరంతర వర్షం కారణంగా,గ్రామంలోని 3వ వార్డులోని విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ కాలిపోయింది ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఈ సందర్భంగా కొత్త విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను ఏర్పాటు చేయాలని గ్రామవాసులు డిమాండ్ చేశారు. నారిహళ్ల జలాశయం పూర్తిగా నిండినందున రెండు గేట్ల ద్వారా 2అడుగుల నీటిని నిరంతరం నారిహళ్ల నదిలోకి విడుదల చేస్తున్నామని రిజర్వాయర్ అధికారి జరార్దనరెడ్డి తెలిపారు.



నారిహళ్ళ నదికి వదిలిన నీరు

హొసూరు జోన్

కెలవరపల్లి డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో



డ్యాం నుంచి విడుదలవుతున్న నీరు

హొసూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): హొసూరు సమీపంలోని కెలవరపల్లి డ్యాంకు మూడో రోజు కూడా ఇన్‌ఫ్లో పెరిగింది. శుక్రవారం 981 క్యూసెక్కులకు పెరిగింది. డ్యాం పరీవాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తుండడమే డ్యాంకు నీటిప్రవాహం పెరుగుతోందని అధికారులు తెలిపారు. డ్యాం సామర్థ్యం 44.28 అడుగుల ఎత్తు ఉండగా ప్రస్తుతం 40.67 అడుగులకు చేరింది. దీంతో డ్యాం నుంచి నీటిని తెన్‌పెన్నై నదిలోకి విడుదల చేస్తున్నారు. కాగా నీటిలో రసాయన వ్యర్థాలు చేరడంతో నురుగు ఎక్కువగా ఉందని రైతులు, గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలుషితం కాకుండా అడ్డుకట్ట చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తుల స్వాధీనం

హొసూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హొసూరు కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాలలో నిషేధి ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్నారనే సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. కార్పొరేషన్ కమిషనర్ మారిసెల్వి ఆదేశాలతో కార్యాచరణ చేపట్టారు. హొసూరు బస్టాండ్ వెనుక ఉన్న నామల్‌పేట్ ప్రాంతంలోని ఓ దుకాణంలో తనిఖీలు చేయగా భారీ ప్రమాణంలో నిషేధించిన ప్లాస్టిక్ కవర్లు, పేపర్ కప్పులు ఇతర ఉత్పత్తులు ఉన్నట్టు గుర్తించారు. మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అజిత, అన్బళగన్, శ్రీనివాసన్ నేతృత్వంలోని బృందం సోదాలు నిర్వహించారు. కేవలం ఒక దుకాణం నుంచి సుమారు 4 టన్నుల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకోవడం సంచలనం కలిగించింది.



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ కవర్ల బస్తాలు

రోడ్డు పనులకు ఎమ్మెల్యే గణేష్ భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కంప్లి కోటలోని తుంగభద్ర నది సమీపంలో 2024-25 సంవత్సరానికి కళ్యాణ్ పథకం కింద దాదాపు రూ.509.9 లక్షల వ్యయంతో నిర్మించనున్న కోటే రాంసాగర్ బనవాసి సీసీ రోడ్డు అభివృద్ధికి ఎమ్మెల్యే జేఎన్ గణేష్ శనివారం భూమిపూజ చేశారు. తరువాత ఆయన విలేకరులతో మాట్లాడుతూ కంప్లి కోటే ప్రాంతం నుంచి రాంసాగర్ వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇక్కడి రైతులకు అనుగుణంగా రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక రైతు సహకరించాలని కోరారు. మిగిలిన బనవాసి రోడ్డును కేకేఆర్‌డీబీ పథకం కింద అభివృద్ధి చేస్తామన్నారు. జవుకు, దేవసముద్రం, సోమసముద్రం మధుర రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయి. ఈడీ అధికారులు ఇంటిపై దాడి చేసినప్పుడు వారు మహాజరు చేసి స్పష్టం చేశారు. కొన్ని వార్తాపత్రికలు లేనిపోని రాయడం సరికాదన్నారు. అలాంటి వారిపై పరువునష్టం వేయాల్సి వస్తుందన్నారు. తప్పుడు నివేదిక ఇస్తే నమ్మకం పోతుందన్నారు. నియోజకవర్గంలో రైతులకు సమస్యలు తలెత్తకుండా పొలాలకు వెళ్లే రోడ్లన్నీ అభివృద్ధి చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లడ్డూ వన్నూర్ వలీ, సీఆర్ హనుమంతు, రైతు సంఘం అధ్యక్షులు నవీన్, హేమయ్యస్వామి, చంద్రశేఖర్, మంజు, పరశప్ప, శంకర్, షణ్ముకప్ప, కరిబసవనగౌడ పాల్గొన్నారు.

చిరుత సంచారంతో జనం బెంబేలు..!



డ్రోన్ కెమెరాకి చిక్కిన చిరుత

రాయచూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాయచూరు తాలూకాలోని డోంగ రాంపూర్ పరిసరాల్లో చిరుత సంచరిస్తుండడం గ్రామస్థులకు ఆందోళనకరంగా మారింది. గడచిన వారం రోజులుగా చిరుత సంచరిస్తున్నట్లు చెబుతున్న గ్రామస్థులు రెండు రోజుల క్రితం అటవి శాఖ అధికారులు ఏర్పాటు చేసిన డ్రోన్ కెమెరాలో చిరుత ఉన్నట్లు నిర్ధారణ కావడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లెందుకు సహితం గ్రామస్థులు భయం పడుతున్నారు. కాగా చిరుత కోసం గ్రామం సమీపంలోని పొదలు, గుట్ట మాటున బోన్‌లను ఏర్పాటు చేసిన అధికారులు చిరుత సంచారంపై నిఘా ఉంచేందుకు గ్రామ పరిసరాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్‌లను ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారు జామున చిరుత గుట్టలో సంచరిస్తు బోన్ సమీపంలోకి వచ్చినా తిరిగి మరోవైపు మళ్లి పోవడంతో బోన్‌లో చిక్కలేదని అటవి శాఖ అధికారులు గుర్తించారు. త్వరలోనే చిరుతను బంధిస్తామని గ్రామస్థులకు అభయం ఇచ్చారు.

కృష్ణమ్మకు జలకళ.. నారాయణపూర్ నుంచి నీటి విడుదల

రాయచూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): కృష్ణ పరివాహక ప్రాంతంలో గడచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల నదిలో ప్రవాహం పెరిగింది. నారాయణపూర్ జలాశయం గరిష్ట నీటి మట్టానికి చేరడంతో 14 క్రస్ట్ గేట్లను ఎత్తి 52 వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేస్తున్నట్లు కేబీజేఎన్ఎల్ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలో కృష్ణనదికి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నారాయణపూర్ జలాశయం పరిసరాల్లోని విజయపూర, బాగలకోట, బెళగావితో పాటు మహారాష్ట్ర సరిహద్దుల్లో సహితం విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇప్పటికే నారాయణపూర్ జలాశయంలో 29.57 టీఎంసీల నీరు వచ్చి చేరగా రిజర్వార్ సామర్థ్యం 33.31 టీఎంసీలుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. 492.252 మీటర్‌లకు గాను ఇప్పటికే 491.18 మీటర్‌ల మేరకు నీరు వచ్చి చేరడంతో 52వేల క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు విడుదల చేశారు. జలాశయంలో ఇన్ఫ్లో 50 వేల క్యూసెక్కులు ఉన్నట్లు కేబీజేఎన్ఎల్ అధికారులు తెలిపారు.



నారాయణపూర్ జలాశయంలో చేరిన నీరు


కాంగ్రెస్‌లో చేరిక



భవానీప్రసాద్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నగరంలో సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి నేతృత్వంలో సీనియర్ నాయకులు భవానీప్రసాద్ పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శనివారం వారికి సిటీ ఎమ్మెల్యే నారాభరత్ రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీలోకి భవాని ప్రసాద్ రావడంతో మరింత బలం చేకూరిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మించు శ్రీనివాస్, ప్రభంజన్, జబ్బర్, మాజీ మేయర్ నాగమ్మ, కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, అగ్రి గోవిందు, వన్నప్ప, శివ, భవాని ప్రసాద్, తిరుపాల్‌రెడ్డి, వెంకటేష్, అంజి, రఘు, నాగరాజు, శంకర్, కౌశిక్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠ్యేతర కార్యక్రమాలు ఉపయోగకరం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న బసవంతరాయ కురి

బళ్లారి సిటీ, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాఠ్యేతర కార్యక్రమాలు విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని అసోసియేషన్ పరిపాలనా అధికారి బసవంతరాయ కురి అన్నారు. శనివారం విజయనగరం జిల్లా హొసపేటలోని విజయనగర కళాశాలలో బళ్లారి వీరశైవ విద్యావర్ధక సంఘం ఆధ్వర్యంలో అన్నిసంఘాల కార్యకలాపాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఇంగ్లీషు ల్యాబ్, టాలీ ప్రోగ్రామ్‌లలో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థుల కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఉచ్చారణ నైపుణ్యాలను మెరుగుపరచడానికి భాషా ప్రయోగశాలలో 50 కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ప్రభుగౌడ మాట్లాడుతూ.. కళాశాలలోని 18మంది విద్యార్థులు రూ.5.1 లక్షల వరకు వార్షిక జీతం ప్యాకేజీతో వివిధ కంపెనీలకు ఎంపికయ్యారన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల పాలకమండలి అధ్యక్షుడు మల్లికార్జున మెట్రీ, సెల్ కన్వీనర్ రవికిరణ్, వీవీ సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు కణేకల్ మహంతేశ్, కార్యదర్శి అరవింద్‌పటేల్, డైరెక్టర్ల బోర్డు సభ్యుడు కామారెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

శ్రీశ్రీ (వర్ధంతి)



శ్రీశ్రీగా పేరొందిన శ్రీరంగం శ్రీనివాసరావు 1910 ఏప్రిల్ 30న విశాఖపట్నంలో జన్మించారు. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి. విప్లవకవిగా, సంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాదిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం సంస్థాపక అధ్యక్షుడిగా, సినీ గేయ రచయితగా రాణించారు. 'మహాప్రస్థానం' కావ్యం ఎంతో పేరొందింది. అల్లూరి సీతారామరాజు సినిమాకు 'తెలుగువీర లేవరా..' పాట ఆయన ఆణిముత్యాలలో ఒకటి. కేంద్రసాహిత్య అకాడమీ, రాజా లక్ష్మీ ఫౌండేషన్ తదితర పురస్కారాలు పొందారు. 1983 జూన్ 15న కన్నుమూశారు.

ఇల్లిందల సరస్వతీదేవి (జయంతి)



కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్న తొలి తెలుగు రచయిత్రిగా గుర్తింపు పొందిన ఇల్లిందల సరస్వతీదేవి 1918 జూన్ 15న పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో జన్మించారు. స్వయంకృషితో ఆంగ్ల, హిందీ భాషలు నేర్చుకున్నారు. జర్నలిజంలో డిప్లమో చేశారు. 250 కథలు, 5 నవలలు, 5 వ్యాస సంపుటాలు, జీవితచరిత్రలు రచించారు. ఇతర భాషల పుస్తకాలను కూడా అనువాదం చేశారు. బాల సాహిత్య కారిణిగా నాటికలు, రేడియో నాటికలు రచనలు చేశారు. 1958లో ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ శాసనమండలికి ఎమ్మెల్సీగా నామినేట్ అయ్యారు. 1998 ఆగస్టు 31న కన్నుమూశారు.

దేవిప్రసాద్ రాయ్ చౌదరి (జయంతి)




పద్మభూషణ్ గ్రహీత డీపీ రాయ్ చౌదరిగా పేరొందిన దేవిప్రసాద్ రాయ్ చౌదరి 1899 జూన్ 15న జన్మించారు. ప్రత్యేకించి ఇత్తడి విగ్రహాలు రూపొందించడంలో ప్రసిద్ధులు. అంతేకాక చిత్ర కారుడిగా, విద్యావేత్తగా రాణించారు. సామాజిక అంశాలపై ఆయన చిత్రాలు గీసేవారు. తైలవర్ణచిత్రాలు, పోర్ట్రైట్స్ కూడా గీసేవారు. మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్‌కు ప్రిన్సిపాల్‌గా 1929 నుంచి 1957 వరకు వ్యవహరించారు. ఫెలో ఆఫ్ లలిత్ కళా అకాడమీగా ఎంపికయ్యారు. 1975 అక్టోబరు 15న కన్నుమూశారు.

సురయ్యా (జయంతి)



సురయ్యా జమాల్ షేక్ 1929 జూన్ 15న లాహోర్‌లో జన్మించారు. ప్రముఖ హిందీ నటి, గాయని. 1941లో తాజ్‌మహల్ చిత్రంలో బాలనటిగా మేనమామ జుహూర్ పరిచయం చేశారు. 'మీర్జాగాలిబ్' సినిమా ఆమెకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిపెట్టింది. 67 సినిమాలలో నటించగా 300కుపైగా పాటలు పాడి గాయనిగా 'క్వీన్ ఆఫ్ మెలోడి'గా గుర్తింపు పొందారు. 2004 జనవరి 31న కన్నుమూశారు.

జియా ఫరీదుద్దీన్ దాగర్ (జయంతి)




ఉస్తాద్ జియా ఫరీదుద్దీన్ దాగర్ 1932 జూన్ 15న రాజస్థాన్ రాష్ట్రం ఉదయ్‌పూర్‌లో జన్మించారు. ధృపద్ శైలిలోని హిందూస్తానీ శైలి సంగీతంలో రాణించారు. సంగీత నాటక అకాడమీ అవార్డు, తాన్‌సేన్ సమ్మాన్ అవార్డు ఇతర గౌరవాలు అందుకున్నారు. ఐఐటీ బాంబేలో ప్రత్యేక అతిథిగా వ్యవహరించారు. 2013 మే 8న కన్నుమూశారు.

చక్రి (జయంతి)



చక్రధర్ అలియాస్ చక్రి 1974 జూన్ 15న వరంగల్ జిల్లా మహబూబాబాద్ మండలం కంబాలపల్లిలో జన్మించారు. ప్రముఖ సంగీత దర్శకుడు, గాయకుడు. టాలీవుడ్‌లో 85 సినిమాలకు సంగీతాన్ని అందించారు. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన 'బాచి' సినిమాతో కెరీర్‌ను ఆరంభించారు. కంపోజర్‌గా కొత్త గాయకులకు, రచయితలకు అవకాశం కల్పించారు. ప్రత్యేకించి 'రవితేజ' సినిమాలకు మ్యూజికల్ హిట్స్ అందించారు. ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకున్నారు. 2014 డిసెంబరు 15న కన్నుమూశారు.

అన్నా హజారే (పుట్టినరోజు)



దేశంలో పేరొందిన సంఘ సంస్కర్త, 'పద్మభూషణ్' గ్రహీత అన్నా హజారే 1937 జూన్ 15న జన్మించారు. అసలు పేరు కిసాన్ బాబురావ్ హజారే. గ్రామాల అభివృద్ధికి, పాలనలో పారదర్శకత కోసం పాటుపడ్డారు. అవినీతి రహిత సమాజ లక్ష్యంగా చైతన్యం కల్పించారు. నిరాహార దీక్షలు, నిరసనలు చేశారు. మహారాష్ట్రలోని అహ్మదానగర్ జిల్లాలోని రాలెగన్‌సిద్ధి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి 1992లో 'పద్మభూషణ్' అందుకున్నారు. అంతర్జాతీయ, జాతీయస్థాయిలో గౌరవాలు అందుకున్నారు.

లక్ష్మీమిట్టల్ (పుట్టినరోజు)



లక్ష్మీమిట్టల్ 1950 జూన్ 15న రాజస్థాన్ రాష్ట్రం సదుల్‌పూర్‌లో జన్మించారు. ప్రపంచంలో అతిపెద్ద స్టీల్ తయారీ సంస్థ అర్సెలర్ మిట్టల్‌కు ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్. 2008 నుంచి పలు సంస్థల బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌లలో ఒకరిగా కొనసాగుతున్నారు. గ్లోబల్ సీఈఓ కౌన్సిల్ ఆఫ్ ది చైనీస్ పీపుల్స్ అసోసియేషన్ ఫర్ ఫ్రెండ్‌షిప్ విత్ ఫారిన్ కంట్రీస్‌కు సభ్యుడిగా, వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్స్ ఇంటర్నేషనల్ బిజినెస్ కౌన్సిల్, యూరోపియన్ రౌండ్ టేబుల్ ఆఫ్ ఇండస్ట్రియలిస్ట్ తదితర బోర్డులలో ఉన్నారు. 2024లో గ్లోబల్‌స్థాయిలో 113వ స్థాయి లోనూ దేశంలో శ్రీమంతులలో 13వ స్థానంలో ఉన్నారు.

స్కాలర్‌షిప్‌నకు ఎంపిక

పెనుకొండ రూరల్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టూరు జడ్పీహెచ్ఎస్‌లో 8వతరగతి చదువుతున్న బిందులహరి, రచన, యామిని స్కాలర్‌షిప్‌నకు 2024-25 విద్యాసంవత్సరంలో వీరు ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలు పాల్గొన్నారు.

నేరేడు పండ్లకు డిమాండ్.. కిలో రూ.250పైనే



తోపుడుబండి పై నేరేడుపండ్ల విక్రయం

బంగారపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మామిడిపండ్ల సీజన్ ఇంకా ముగియకనే మార్కెట్‌లోకి నేరేడుపండ్లు వచ్చాయి. అడవులలోని చెట్లనుంచి ప్రస్తుత సీజన్‌లో వచ్చే పండ్లకు రోగనిరోధశక్తి అధికంగా ఉంటుంది. అనేక రుగ్మతలను నియంత్రిస్తుందనే విశ్వాసం ఉంది. అయితే ధర మాత్రం కిలో రూ.250పైమాటే పలుకుతోంది. ఈ పండ్లకు పట్టణాలు, నగరాలలో డిమాండ్ పెరిగింది. దీంతో మార్కెట్‌లోకి వచ్చే పండ్ల ధరలు ఎక్కువగానే ఉంటోంది. ఔషధ గుణాలతోపాటు మధుమేహాన్ని నియంత్రించే శక్తి ఉండడంతోనే ధర గతంలోకంటే కొంచెం అధికంగా ఉందని పలువురు వ్యాపారులు అభిప్రాయపడ్డారు. దేశవాళీ రకం నాటితే 8-10ఏళ్ల తర్వాత దిగుబడి వస్తుందని, మరో రకం వాటికి మూడేళ్లకే పండ్లు వస్తాయన్నారు. మార్చి, ఏప్రిల్‌లల్లో పూత వస్తుందని, జూన్‌లో పండ్లుగా మారుతాయన్నారు. ఒక చెట్టు నుంచి సుమారు 2 క్వింటాళ్ల పండ్లు వస్తాయన్నారు. బంగారపేట పట్టణానికి సరిహద్దులోని తమిళనాడు ప్రాంతం నుంచి నేరేడుపండ్లు వస్తున్నాయన్నారు.

దాతల సహకారంతో సర్వతోముఖాభివృద్ధి



పుస్తకాలు ఇతర సామగ్రితో విద్యార్థులు

ముళబాగిలు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు దాతలు ఇచ్చే సహకారంతో ప్రతి సౌలభ్యాన్ని సద్వినియోగం చేసుకుని సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, స్థానికులు సహకరించాలని బీఈఓ కేఎన్ రామచంద్రప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని కన్నత్త గ్రామ ప్రభుత్వ కన్నడ ప్రాథమికోన్నత పాఠశాలలో గాయత్రి డిజిటల్ ప్రింటర్స్ యజమాని వెంకటేశ్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నోటుపుస్తకాలు, లేఖనా సామగ్రి పంపిణీ చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పలువురు దాతలు తమవంతు సహకారం అందిస్తుండడంపై హర్షం వ్యక్తం చేశారు. బీఆర్‌సీ సోమేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఫక్రుద్దీన్, సీఆర్‌పీలు శివకుమార్, అనిల్‌కుమార్, వ్యాయామ అధికారి రహీం షరీఫ్ స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

దొడ్డబనహళ్ళిలో గ్రామసభ



గ్రామసభను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుళా లింబావళి

మహదేవపుర, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దొడ్డబనహళ్ళి గ్రామపంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి నీరుపోయడం ద్వారా ఈ ఏడాది తొలి గ్రామసభకు ఎమ్మెల్యే మంజుళా లింబావళి ప్రారంభించారు. ఇదే సందర్భంగా గ్రామపంచాయతీ నూతన భవనం, బిదరె అగ్రహార, కాటం నల్లూరు గ్రామం చెరువుల అభివృద్ధి, పాఠశాల తరగతుల అభివృద్ధి, సీఎస్ఆర్ పథకంలో వాలీబాల్ మైదానం, కోనదాసపురలో బేడిస్ సంస్థ సహకారంతో పాఠశాల భవన నిర్మాణం, బండాపురలో బీడీఏ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, అండర్‌గ్రౌండ్ నీటి సంస్కరణ విభాగాన్ని నిర్మించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులు, కేంద్ర ప్రభుత్వ జలజీవన్ మిషన్ పథకం పనులు ప్రగతిదశలో ఉన్నాయన్నారు. చిక్కబనహళ్ళి, కాటం నల్లూరు, కోనదాసుర చెరువుల అభివృద్ధికి గ్రాంట్లు మంజూరయ్యాయని త్వరలోనే పనులు చేపడతామన్నారు. ఇదే సందర్భంగా గర్భిణీలకు కిట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెంగళూరు తూర్పు తాలూకా ఈఓ వసంతకుమార్, గ్రామపంచాయతీ అధ్యక్షుడు లోకేశ్, ఉపాధ్యక్షురాలు శశికళ మంజునాథ, పీడీఓ నటరాజ్, అక్షతా తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ధ్యానమందిర నిర్మాణానికి వినతి



టీటీడీ బోర్డు ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తిరుమల పరిధిలో శ్రీవేంకటేశ్వర స్వామి ధ్యానమందిర నిర్మాణానికి అవకాశం కల్పించాలని కర్ణాటక బలిజ సంఘం, కైవార క్షేత్రం ధర్మాధికారి డాక్టర్ ఎంఆర్ జయరాం నేతృత్వంలో విన్నవించారు. టీటీడీ బోర్డు ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం మత్తికెరె రామయ్య ఆసుపత్రి ప్రాంతంలోని ద్వారకా సభాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు ఛైర్మన్‌ను సాదరంగా స్వాగతించి సత్కరించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఆర్ జయరాం మాట్లాడుతూ కైవారలో సద్గురు యోగి నారేయణ స్వామి ఎన్నో కీర్తనలు తిరుమల వేంకటేశ్వరస్వామిపై పాడారన్నారు. తిరుమలకు, కైవారకు అవినాభావ సంబంధం ఉందన్నారు. కైవారలో టీటీడీ హోమాలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. టీటీడీ అనుమతితో పోతన భాగవతాన్ని కన్నడకు అనువాదం చేశామన్నారు. రామానుజాచార్య జన్మ సహస్ర మహోత్సవాన్ని భక్తికార్యక్రమాలతో ఏడాదిపాటు నిరంతరంగా నిర్వహించామన్నారు. ఇదే సందర్భంలో తిరుపతికి పాదయాత్ర చేపట్టామన్నారు. అన్ని వర్గాలకు అనుకూలమయ్యేలా తిరుమలలో వేంకటేశ్వరస్వామి ధ్యానమందిరాన్ని నిర్మించేందుకు స్థలం కేటాయించాలని విన్నవించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు మాట్లాడుతూ సమగ్ర చర్చలు జరిపి నిర్ణయం తీసుకుంటామన్నారు. మాజీ మంత్రి డాక్టర్ ఎంఆర్ సీతారాం, సీనియర్ ఐఏఎస్ అధికారి ఎంఆర్ శ్రీనివాసమూర్తి, బీఎం కృష్ణయ్య, ఐఎస్ఎఫ్ మనోజ్‌కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు నరేశ్‌కుమార్, శాంతారాం, ఆర్ఎస్ఎస్ ముఖ్యులు తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే నాగరాజ్, తార అనురాధ, పద్మావతి, బలిజ సంఘం అధ్యక్షుడు పెరికల్ సుందర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

నీట్‌లో అలెన్‌కు ఉత్తమ ర్యాంకులు

బెంగళూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షా ఫలితాల్లో బెంగళూరు అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు దక్షిణభారత హెడ్ మహేశ్‌యాదవ్ తెలిపారు. ఆలిండియా ర్యాంకులో రుచిర్‌గుప్త 22వ ర్యాంకు, ప్రాంన్షు జహగీర్‌దార్ 42వ ర్యాంకు, ఆరిద్య అగర్వాల్ 190వ ర్యాంకు, విశ్వ వి 334వ ర్యాంకు రిషా గోయెల్ 529వ ర్యాంకు సాధించారన్నారు. వెయ్యిలోపు ఆరుగురు విద్యార్థులు రాణించినట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా మహేశ్‌యాదవ్ మాట్లాడుతూ అలెన్ విద్యాసంస్థలు నిరంతరం విద్యార్థులను చైతన్యం చేసి ఉత్తమర్యాంకులు సాధించేలా పాటుపడుతోందన్నారు. ప్రతి విద్యార్థి ఆశయాలను సాకారం చేసేందుకు కట్టుబడ్డామన్నారు.



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

విమాన ప్రమాద మృతులకు నివాళి



భారతీనగర్‌లో నివాళులు అర్పిస్తున్న స్థానికులు

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన దుర్ఘటనలో మృతి చెందినవారికి సంతాపం వ్యక్తం చేస్తూ శనివారం కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. భారతీనగర్ రెసిడెంట్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం స్థానిక కాక్స్‌టౌన్ కూడలిలోని డాక్టర్ రాజ్‌కుమార్ విగ్రహం వద్ద కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొని మృతులకు సంతాపం వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు వెలిగించి రెండు నిమిషాలపాటు మౌనం వహించారు. భారతీనగర్ రెసిడెంట్స్ ఫోరంనకు చెందిన సురేంద్రరవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



బ్యాగులతో విద్యార్థులు

బాగేపల్లి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): విద్య, ఆరోగ్య, పర్యావరణ రంగాలలో సంస్థలు సీఎస్ఆర్‌లో భాగంగా ప్రోత్సహించడం అభినందనీయమని, సంస్థల సౌలభ్యాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జువారి ఫార్మాహబ్ కంపెనీ హెచ్‌కే మనోహర్ అభిప్రాయపడ్డారు. తాలూకాలోని మిట్టేమరి గ్రామ ప్రభుత్వ మాదిరి ప్రాథమికోన్నత పాఠశాలలో సంస్థ తరఫున విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. కార్పొరేట్ సంస్థలు తమ లాభాలతోపాటు సామాజిక బాధ్యతతోపాటు సమాజసేవ చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. పిల్లలు మొబైల్‌కు వ్యసనం కాకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. పుస్తకపఠనాన్ని ప్రోత్సహించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ముస్తఫా మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థలు మిట్టేమరి ప్రభుత్వ పాఠశాలను గుర్తించి పలు సేవలందిస్తోందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వీ భాగ్యమ్మ, జీఆర్ మురళీధర, కోమల, ఎంసీ చంద్రకళ, జువారి ఫార్మ్‌వాచ్ కంపెనీ సతీశ్, గజేంద్ర, సురేశ్, అనిల్‌కుమార్, మంజునాథ్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా అక్షరాభ్యాసం



వర్ణమాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

బెంగళూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సుంకదకట్టె శ్రీనివాసనగర్‌లోని అంజలి కాన్వెంట్ నైటింగేల్ హైస్కూల్‌లో 2025-26 సంవత్సరానికి విద్యార్థులకు తల్లిదండ్రులచే అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్‌బ్యాగు ఉచితంగా పంపిణీ చేశారు. సరస్వతీదేవి పూజ చేశారు. సంస్థ కార్యదర్శి సరళ కె గౌడ, ప్రిన్సిపాల్ డాక్టర్ బీ కృష్ణేగౌడ మాట్లాడుతూ ఇల్లే తొలి పాఠశాల, తల్లే తొలి గురువు అన్నారు. పిల్లల పెరుగుదులలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు.

ఆర్థిక అంశాలపై సెమినార్

రాయచూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆర్థిక స్థితిలు మరింత బలోపేతమైయేందుకు పరిశోధనల ద్వార వచ్చే నివేదికలు విధానాలుగా రూపొందించాల్సిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆర్థిక అధ్యాయన కేంద్రం అధికారి, నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ కృష్ణ రాజ అన్నారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కాళాలలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన విధానాలు రూపాయి విలువ, మారకం, పర్యావసనాలు సమస్యలు పరిష్కారం అనే అంశం పై శనివారం సెమినార్ నిర్వహించారు. ప్రధానోపన్యాసం చేసిన డాక్టర్ కృష్ణరాజ, దేశ ఆర్థిక విధానాల రూపకల్పనలోను సామాజిక మార్పులోను ఆర్‌బీఐ ఆర్థిక పరిశోధన కేంద్రం అత్యంత కీలకంగా పని చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీల అమలుతో పాటు సాగుతున్న ఆర్థిక అభివృద్ది గురించి మాట్లాడిన డాక్టర్ కృష్ణరాజ, ఆర్థిక అధ్యాయన సంస్థలు చేసే పరిశోధనలు ప్రతియొక్కటి విధానాలు కీలకంగా మారాలన్నారు. కాగా ఆర్థిక సామాజిక మార్పుల నేపధ్యంలో కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని విద్య సంస్థల్లో మరింత గుణాత్మకమైన మార్పులు రావాల్సి ఉందన్నారు. 1920 అనంతరం దేశ ఆర్థిక రంగంలో అనేక విప్లవాత్మకమైన పరిణామాలు జరిగాయన్నారు. అందకు పూర్వం కేవలం ఎగుమతుల పైనే ఆధారపడిన ఆర్థిక విధానాలు అనంతరం స్థానికంగా వనగూడే వనరులు, ఆదాయాల పై ఆర్థిక స్థితిగతులు ఆధారన పడిన విషయాన్ని విద్యార్థులు గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో పాల్గొన్న రాయచూరు ఎంపీ జీ కుమార్ నాయక్ మాట్లాడుతూ ఆర్థిక వ్యవస్థలో జరుగుతున్న మార్పులు, సంభవిస్తున్న పరిణామాలు ఆర్థిక ఎదుగుదలతో పాటు ఆర్థిక పరమైన అంశాల పై విద్యార్థులు మరింత అవగాహన పెంచుకోవాల్సి ఉందన్నారు. సెమినార్‌కు సిరవార, సింధనూరులతో పాటు గంగావతి, బీదర్, కలబుర్గి, బెంగళూరు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలతో విద్యార్థులు

శిడ్లఘట్ట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచనహళ్ళి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులకు హెచ్‌డీ దేవేగౌడ అండ్ జయప్రకాశ్ నారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రవికుమార్ పాల్గొని విద్యార్థులకు నోటు పుస్తకాలు, లేఖనా సామగ్రి వితరణ చేశారు. కొన్నిరోజులుగా తాలూకాలోని వివిధ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మోహిమబేగం, ఉపాధ్యాయులు బైరారెడ్డి, మూర్తి, మమతా, సవితా, సుష్మా, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అహల్య, ఉపాధ్యాయులు మంజునాథ్, మధుసూధన్, వీణా, మంజుళా, సుధా తదితరులు పాల్గొన్నారు.

మోంట్రా ఎలక్ట్రిక్ సూపర్‌కార్గో విడుదల

బెంగళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మోంట్రా ఎలక్ట్రిక్ కంపెనీ మూడుచక్రాల రవాణా వాహనాలు సూపర్‌కార్గోను బెంగళూరులో లాంఛనంగా విడుదల చేసింది. టిఐ క్లీన్ మొబిలిటీ ఎండీ జలజ్‌గుప్త, లాస్ట్ మైల్ మొబిలిటీ బిజినెస్ హెడ్ రాయ్ కురియన్, స్మాల్ కమర్షియల్ వెహికల్ సీఈఓ సజునాయర్‌లు లాంచనంగా ప్రారంభించారు. జలజ్‌గుప్త మాట్లాడుతూ మురుగప్ప గ్రూప్‌కు శతాబ్దాల వ్యాపార చరిత్ర ఉందన్నారు. ఆధునిక కాలంలో ప్రజలకు అవసరమయ్యేలాంటి వాహనాలు సమకూర్చదలిచామన్నారు. మినీ సరుకు రవాణా వాహనాలకు డిమాండ్ ఉందని అందుకే మార్కెట్‌లోకి తీసుకొచ్చామన్నారు. ఇదే సమావేశంలో డీలర్‌లు, డిస్ట్రిబ్యూటర్‌లతో ప్రత్యేక సమావేశం జరిపారు.

లైఫ్‌స్టైల్‌లో 50శాతం రాయితీలు

బెంగళూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ బ్రాండెడ్ దుస్తులు, వస్తువులకు పేరొందిన లైఫ్‌స్టైల్‌లో 50శాతం రాయితీలను ప్రకటిస్తున్నట్టు సంస్థ ప్రెసిడెంట్, డిప్యూటీ సీఈఓ రితేశ్ మిత్రా ప్రకటించారు. లైఫ్‌స్టైల్ ఆఫర్‌లకోసం ఎదురుచూస్తున్న వారికి ఎండ్ ఆఫ్ సీజన్ సేల్‌ను తీసుకొచ్చామన్నారు. 50శాతం రాయితీలతో కోరుకున్న మోడల్స్‌ను సొంతం చేసుకోవచ్చునన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్‌కార్డు కల్గినవారికి అదనంగా 10శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఈ సీజన్ ప్రచారం కోసం ప్రముఖ నటి తమన్నాభాటియా రాయబారిగా వ్యవహరిస్తున్నారన్నారు. దేశీయ అంతర్జాతీయ బ్రాండ్లతోపాటు తాజా ట్రెండ్స్, ఫ్యాషన్‌ల ఎంపిక వినియోగదారులను కట్టిపడేయనుందన్నారు. క్లాజిక్ డిజైన్లు, ప్రీమియం స్టైల్ లేదా రోజువారీ స్టైల్‌కోసం ఎదురుచూస్తున్నవారికి అనుగుణంగా హై ఫ్యాషన్ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు. దేశవ్యాప్తంగా 300 టాప్ బ్రాండ్‌లు ఆకర్షణీయమైన ధరలలో పొందవచ్చునన్నారు.

రోడ్డును బాగు చేయరూ..



కంకరరోడ్డు ఇలా..

చేళూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): చింతామణి - చేళూరు మార్గంలోని బురుడుగుంటె క్రాస్ నుంచి బురుడుగుంటె వరకు తారురోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. బురుడుగుంటె గంగమ్మదేవస్థానానికి ప్రతి ఆదివారం, మంగళ, శుక్రవారాలలో పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. సరిహద్దులోని ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలనుంచి కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల రాకపోకల దృష్ట్యా రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన ఐ తునసనపల్లి పాఠశాల భవనం

శిథిలావస్థకు పాఠశాల భవనాలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం

అగళి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొన్ని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వర్షం వస్తే పాఠశాల జలమయంగా మారుతాయని, విద్యార్థులు వరండాలో కూర్చొని చదువుకోవాల్సి వస్తోందని వారు అంటున్నారు. ఐ తునసనపల్లి, బొమ్మరసనపల్లి ఎం. గొల్లహట్టి, కంబదహళ్లి, కసాపురం గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. విద్యాధికారులు మాత్రం పట్టించుకోకుండా ఉన్నారని, ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలను గుర్తించి మరమ్మతు చేయాలని కోరుతున్నారు.